



డంపింగ్ యార్డు ముందు ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలం పెద్ద గుడ్డం పల్లి సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును మరో చోటకు మార్చకపోతే ఆందోళన తీవ్ర తరం చేస్తామని ఎం బీరేపల్లి, పెద్దగుడ్డంపల్లి, చిన్న గుడ్డంపల్లి, మణేసముద్రం, మలుగూరు గ్రామానికి చెందిన ప్రజలు హెచ్చరించారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానిక డంపింగ్ యార్డు ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పట్టణంలో డంపింగ్ యార్డు లేక పోవడంతో గ్రామీణ మండలంలో దాదాపు 33 ఎకరాల్లో డంపింగ్ యార్డును చేశారన్నారు. ఈ డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. డంపింగ్ యార్డు ప్రారంభించి సంవత్సరం గడుస్తున్న ఇప్పటి వరకు యంత్రాలను ఏర్పాటు చేయలేదని, చెత్తతో పాటు జంతువుల కబేళాలను సైతం ఇక్కడ వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. దీంతో దుర్వాసన ఎక్కువ ఉందన్నారు. కమిషనర్ వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చే వరకు తాము ఆందోళన విరమించమని తేల్చి చెప్పారు. విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ అక్కడికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. వారంలోగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారంలోగా సమస్యను పరిష్కరించక పోతే గ్రామాల్లో దండోరా వేయించి, పెద్ద ఎత్తున 5 గ్రామాల ప్రజలు మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

'జలజీవన్' ఏదీ..?

ఇంటింటికీ ఉచిత కొళాయి ఒట్టిమాటే...

67 గ్రామాల్లో ప్రారంభం కాని జెజెఎం

Har Ghar Jal
Jal Jeevan Mission



ప్రజాశక్తి - చిలమత్తూరు

జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద ప్రతి ఇంటికి ఉచిత కొళాయి పేరిట చేపడుతున్న కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. చిలమత్తూరు మండల వ్యాప్తంగా 12 గ్రామపంచాయతీల్లో 84 గ్రామాలు ఉన్నాయి. వీటిలో కేవలం 9 గ్రామపంచాయతీలో జల జీవన్ మిషన్ కార్యక్రమం మొదలు పెట్టినా మండల వ్యాప్తంగా కేవలం 17 గ్రామాలలో మాత్రమే ఈ కార్యక్రమం చేపట్టారు. వీటిలోను పంచాయతీ బోర్లకు చెందిన పైప్‌లైన్లకు కొళాయిలు ఏర్పాటు చేసి ఇదే జలజీవన్ మిషన్ అని చెబుతున్న పరిస్థితి నెలకొంది. 84 గ్రామాలలో కేవలం 17 గ్రామలలో మాత్రమే జెజెం పనులు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణు తెలిపారు. ఇక 67 గ్రామాలలో అసలు జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం కాలేదు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా భూగర్భజలాల ఇంకిపోతున్న పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి మండలంలో తాగునీటి కష్టాలు మొదలు కానున్నట్లు సంకేతాలు అందుతున్నాయి.2019లో జలజీవన్ మిషన్ ప్రారంభం అయింది. 2024 నాటికి పూర్తి స్థాయిలో ప్రతి ఇంటికి ఉచిత కొళాయి ఏర్పాటు చేయడం జలజీవన్ మిషన్ లక్ష్యం అయితే 2023 సంవత్సరం ముగింపుదశకు వస్తున్నా మండలంలో కేవలం 20 శాతం గ్రామాలలో కూడా ఈ పనులు పూర్తికాకపోవడం అధికారుల చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

మూడు పంచాయతీల్లో కన్పించని జలజీవన్ జాడ

మండల పరిధిలోని శెట్టిపల్లి,పలగలపల్లి,సోమఘట్ట గ్రామ పంచాయతీలలో కేవలం ఒక్కటంటే ఒక్క గ్రామంలో కూడా జలజీవన్ మిషన్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చేయలేదు. ప్రధానంగా ఈ మూడు పంచాయతీలు మారుమూల ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ పంచాయతీలలో ఇంటికొళాయిలు కాదు కదా కనీసం వీధి కొళాయిలు కూడా సక్రమంగా లేవు కాని ఆ పంచాయతీల్లో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీకొళాయిలు ఏర్పాటు చేయవల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పంచాయతీ ఏర్పాటు చేసిన ట్యాంక్ ల వద్ద గంటల తరబడి నీటి కోసం ఎదురు చూస్తున్నారు. మరికొన్ని చోట్ల సుదీర ప్రాంతంలో ఉన్న వ్యవసాయబోర్లు నుండి నీరు తెచ్చుకుంటున్న పరిస్థితి ఉంది.

పంచాయతీలపైనే అధికభారం

పేరుకు జలజీవన్ మిషన్ అయినా ఆయా గ్రామాల్లో ఇంటి కొళాయిలు మొత్తం గతంలో పంచాయతీ ద్వార ఏర్పాటు చేసిన పైప్‌లైన్లకే అమర్చారు. దీని కారణంగా తర్వాత కాలంలో వచ్చే చిన్న చిన్న రిపేరీలు మొదలు కాలంచెల్లిన కొళాయిలు, మోటర్ నిర్వహణ మొత్తం పంచాయతీలకు భారంగా మారనుంది. గతంలో పంచాయతీలకు డిపాజిట్ చెల్లించేవారు కొళాయి పన్ను చెల్లించేవారు. ఇపుడు ఇవేమి చెల్లించకపోవడంతో పంచాయతీ లకు తలకుమించిన భారంగా మారుతోంది.



గ్రామంలోకి వెళుతున్న ప్యూరిఫైడ్ వాటర్ ప్రయివేటు ట్యాంక్

వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు అధికారుల పరోక్ష సహకారం

మండలంలో ప్యూరిఫైడ్ వాటర్ పేరిట నీటి వ్యాపారం ఊపందుకుంది. గ్రామాల్లో పంచాయతీలు తాగునీటిని అందించడంలో విఫలం కావడం, ఇక జలజీవన్ మిషన్ ద్వార ఇంటి వద్దకే నీటిని అందించే ప్రక్రియ కన్పించకపోవడం కారణంగా ప్రయివేటు వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులకు అధికారులు పరోక్ష సహకారం అందిస్తున్నట్లు కన్పిస్తోంది. ఈ నేపథ్యంలో మండలంలో జలజీవన్‌మిషన్ ఎప్పటికి అమలు అవుతుందోనని మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అంతులేని నిర్లక్ష్యం

జలజీవన్ మిషన్ ప్రారంభం కాని ప్రాంతాలలో గుత్తేదారులు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్న మాట. నిజానికి చేసిన పనులకు బిల్లులు అందకపోతే గుత్తేదారులు ముందుకు రారు. కాని బిల్లులు మంజూరు అవుతున్నాయి. అయినప్పటికి గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేయించడం పనులు అప్పగించడం ,అప్పగించిన పనులను పర్యవేక్షణ చేయకపోవడం వంటి లోపాలతో పాటు ఎంబుక్ చేయకుండా సతాయించడం వంటి కార్యకలాపాల వల్ల ఈ కార్యక్రమం నత్తనడక నడుస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైన ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించి జలజీవన్ మిషన్ ద్వార ఇంటింటింకి ఉచిత కొళాయి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-హిందూపురం

యువత క్రీడల్లో రాణిస్తేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వైసిపి నాయకులు వేణు రెడ్డి అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గత వారం రోజుల నుంచి పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాల మైదానంలో వైఎస్ఆర్ వాలంటీర్స్ క్రికెట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 6 టీంలు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆబాద్ పేట, రహమత్ పురం టీములు తలపడ్డాయి. ఈ పోటీల్లో రహమత్‌పురం జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్లు రామచంద్ర, చంద్ర, నాయకులు నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, సిపిసి సాదిక్, మార్కెట్ చాంద్‌బాషా, టోర్నమెంట్ ఆర్గనైజర్లు జహీర్, ఆయాజ్, దాదు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో నాయకులు

రైస్‌పుల్లింగ్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ సమీపంలో కొల్లకుంట ఇందిరమ్మ కాలనీ సమీపంలో రైస్ పుల్లింగ్ ముఠాను అరెస్టు చేసినట్లు వన్ టౌన్ సిఐ ఈరన్న తెలిపారు. ఈ ముఠా అరెస్టుకు సంబందించిన వివరాలను ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు.

హిందూపురం పట్టణానికి చెందిన రావూరు వెంకట కిషోర్, కర్నూలు జిల్లాకు చెందిన కొప్పెర్ల వెంకటేశ్వర్లు, ఎద్దుల నాగ మల్లికార్జున రెడ్డి, సోమందేపల్లికి చెందిన క్రిష్టప్ప, చిలమత్తూరుకు చెందిన కొండమ్మ గారి రవీంద్రారెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన లంకె శ్రీనివాసరావు, లంకె రవీంద్రరావు, గుంటూరు జిల్లాకు చెందిన పొన్నాడ ప్రసాద్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. రైస్ పుల్లింగ్ వస్తువులను తయారు చేసి ఎక్కువ రేటుకు విక్రయించి డబ్బులు సులభంగా సంపాదించాలని భావించారు. రైస్ పుల్లింగ్ వస్తువులను తయారు చేసి వాటిని సోమందేపల్లి మండలానికి చెందిన నరసింహారెడ్డి ద్వారా ఎవరికైనా విక్రయించి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా శనివారం అందరూ కలసి లంకె రవీంద్ర రావుకు చెందిన కారులో హిందూపురం వచ్చి ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న అజంతా లాడ్జ్‌లో దిగారు. ఈసందర్భంగా వారు కదిరేపల్లి గ్రామానికి చెందిన నరసింహరెడ్డితో కలిశారు. నరసింహారెడ్డి తనకు పరిచయం ఉన్న బెంగుళూరు మడివాల ప్రాంతంలో నివసిస్తున్న ప్రవీణ్‌ను సంప్రదించాడు. రూ.2లక్షలు ఇస్తే ఇత్తడి వస్తువులను రైస్ పుల్లింగ్ మార్చే రసాయన ద్రావణం ఇస్తామని నమ్మబలికారు. లేపాక్షిలో ఉన్న ద్రావణాన్ని తీసుకొని కొల్లకుంట వద్ద కంపచెట్లలో రాగి చెంబులో, ఇత్తడి చెంబులో ద్రావణం పోసి వేడి చేస్తుండగా పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నిందుతులను అదుపులో తీసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు సిఐ చెప్పారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం కొటిపి పంచాయతీ ఇస్లాంపురం వద్ద ముస్లీం మైనార్టీల శ్మశాన వాటిక (ఖబరస్థాన్)కు ప్రహరీ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ పనులను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక భర్త వేణురెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, సర్పంచి సరస్వతి ఆదెప్ప, నాయకులు బసిరెడ్డి, సిపిసి సాదిక్, మార్కెట్ చాంద్‌బాషా, ముతవల్లి అమానూల్లా, ఖాశీం, ఫైరోజ్, ఇలాహి, షఫీ, యాసీన్, నూరూల్లా, సమీవుల్లా, రవి తదితరులు పాల్గొన్నారు.

కదిరి ఎమ్మెల్యే టికెట్ కోసం

అధికార పార్టీలో పోటాపోటీ



బడా నాయకుల వద్దకు క్యూ కడుతున్న ఆశావహులు

నిరుత్సాహంలో సీనియర్లు

టికెట్ మైనార్టీలకేనని ఉపందుకున్న ప్రచారం

ప్రజాశక్తి కదిరి అర్బన్

కదిరి నియోజకవర్గంలో వైసిపి తరపున వైసిపి టికెట్ కోసం ఆశావహుల జాబితా రోజురోజుకూ పెరుగుతూ ఉంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఈ సంఖ్య మరింత పెరిగిపోతోంది. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు తామంటే తాము అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీలో సభ్యత్వం లేని కొంతమంది నాయకులు కూడా టికెట్ ఆశించడం ఆశ్చర్యకరంగా ఉందని నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. పార్టీ జెండాను చేతపట్టి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిపే విధంగా వ్యవహరిస్తూ వైసీపీ నాయకులను కార్యకర్తలను ఒకే తాటిపై నడిపే నాయకులను పక్కనపెట్టి ఆర్థిక బలం ఉన్న వ్యక్తి టికెట్ ఎలా వస్తుందని ఆపార్టీలోనే పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీ నాయకులు ఎస్ఎండి ఇస్మాయిల్ గతంలో నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేసి ప్రస్తుతం చురుకైన నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆయనకు ఇప్పటికే అధిష్టానం వద్ద కదిరి వైసిపి టికెట్ ఖరారు అయిందన్న ప్రచారం జోరందుకుంది. వాల్మీకి పాఠశాల అధినేత పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్, సిఇసి సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి తదితరులు పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తూ కార్యకర్తలను ఆదుకోవడంలో పోటాపోటీగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే టికెట్ కోసం ఇప్పటికే ఎవరి స్థాయిలో వారు వారి స్థాయిల్లో ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ మధ్యకాలంలో బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్న మక్బూల్ ప్రస్తుతం వైసీపీ టికెట్ ఆశిస్తున్నారని, అంతేకాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైపు నుంచి పెద్ద ఎత్తున ప్రయత్నం చేస్తున్నారని పట్టణ ప్రజల్లో ప్రచారం జరుగుతోంది. స్థానిక మైనార్టీ నాయకులు పార్టీ కోసం అహర్నిశలు పనిచేసి నేటి వరకు ఎలాంటి పదవులను ఆశించకుండా పనిచేస్తున్న వారిని పక్కనపెట్టి సీజనల్ వారీగా వస్తున్న వ్యక్తులకు అధిష్టానం ఎలా గుర్తిస్తుందని సొంత పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. కదిరి నియోజకవర్గ వైసీపీలో గ్రూపులు ఏర్పడిన నేపథ్యంలో అధిష్టానం టికెట్ ఖరారు చేసిన వ్యక్తికి నాయకులు ఏమాత్రం సహకరిస్తారన్న ప్రశ్నలు సైతం వినపడుతున్నాయి. కదిరి వైసీపీ టికెట్ కోసం రోజు రోజుకు కొత్త ముఖాలు బయటకు రావడం టికెట్ తమకే అని ప్రచారం చేసుకోవడం కారణంగా పార్టీ పెట్టినప్పుడు నుండి ఇప్పటివరకు పని చేస్తున్న నాయకుల్లో నిరుత్సాహం నెలకొంది. ఈ మధ్యకాలంలో ఓ మైనార్టీ నాయకుడు కడపకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి వద్దకు వెళ్లి టికెట్ తనకు ఇప్పించడానికి ప్రయత్నం చేయండి అని అభ్యర్థించినట్లు కూడా పట్టణంలో ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనప్పటికీ కదిరి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఖరారుపై కదిరి వైసిపి నాయకుల్లోనూ, ఆశావహుల్లోనూ ఉత్కంఠ రేపుతోంది.

చారిత్రక కట్టడాల భద్రతకు చర్యలు

జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి





జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా చారిత్రక కట్టడాలకు పర్యాటక ప్రదేశాలకు నిలయమని, వీటి భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని శ్రీ సత్య సాయి జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ప్రశ్న : శ్రీ సత్య సాయి జిల్లాలో టూరిజం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు: సత్య సాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. పెనుగొండ, లేపాక్షి ,పుట్టపర్తి, హేమావతి ,తిమ్మమ్మ మర్రిమాను ,యోగివేమన ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు. వీటి అభివృద్ధికి పలు చర్యలు చేపడుతున్నాం. ఆ ప్రాంతాలలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా పెనుగొండ కొండపైకి రహదారి ఏర్పాటు, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్మాణానికి చర్యలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో రెస్టారెంట్ల నిర్వాహణ, పర్యాటకులకు విడిది గృహాలు తదితర సౌకర్యాలను ఆయా పర్యాటక ప్రాంతాల్లో చేపడుతున్నాం.

ప్ర పెనుకొండ కొండపైకి రోప్ వే నిర్మాణాలు ఎప్పుడు చేపడతారు..?

జ : ఆంధ్రప్రదేశ్లో ఎక్కడా లేనటువంటి శిల్ప సంపద పెనుగొండ కోట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంది. పెనుగొండ పట్టణం చారిత్రక పట్టణంగా గుర్తించాం. పర్యాటక ప్రదేశాలను కాపాడడానికి ఎన్నో చర్యలు చేపడుతున్నాం. వీటిని అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చించనున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి కొండపైకి రోప్‌వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోపే వే నిర్మాణం జరిగితే పర్యాటక రంగంగా పెనుగొండ మరింత అభివృద్ధి చెందుతుంది.

ప్ర : పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా.?

జ : పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి శ్రీ సత్య సాయి బాబా మందిరంతో పాటు చుట్టుపక్క ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నాం. సత్యసాయి దర్శనార్థం ఎంతోమంది దేశ విదేశీయులు భక్తులు పుట్టపర్తికి వస్తుంటారు. వారిని దష్టిలో ఉంచుకొని పుట్టపర్తి పరిసర ప్రాంతాలైన చిత్రావతి నది బ్యూటిఫికేషన్, బుక్కపట్నం చెరువు అభివృద్ధి పనులు, అందులో బోటింగ్, శిల్పారామం తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాలను సుందరీకరణంగా తీర్చిదిద్దడానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపాము.

ప్ర : కొత్త టూరిజం సర్క్యూట్ కు చర్యలు ఏవి.

జ : పుట్టపర్తి ,పెనుగొండ, లేపాక్షి ,కదిరి, తిమ్మమ్మ మర్రిమాను, యోగివేమన తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక పర్యాటక బస్సును ఏర్పాటు చేసి పుట్టపర్తి నుండి ఉదయం బయలుదేరి రాత్రి లోపు వీటన్నింటిని తిరిగి వచ్చే విధంగా ఏర్పాటు చేసి కొత్త టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని చర్యలు చేపడుతున్నాం. దీనివలన తక్కువ ఖర్చుతో పర్యాటక ప్రాంతాలను ప్రజలు వీక్షించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నాము. కేంద్ర నిధులతో సత్యసాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మరింత కృషి చేస్తాము.

'పురం'లో చరిత్రను తిరగరాద్దాం...

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి



భోజనం వడ్డిస్తున్న వీపికా రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

నియోజక వర్గంలో అందరం కలిసి 2024 ఎన్నికల్లో టిడిపి కంచుకోటను బద్దలు కొట్టి విజయడంఖా మోగించి చరిత్రను తిరగరాద్దామని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి అన్నారు. వైసిపి నాయకులు వాల్మీకి నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వాల్మీకి, మైనార్టీ సహపంక్తి బోజన కార్యక్రమానికి దీపిక వేణు రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అందరూ కలిసి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతు నియోజక వర్గంలో అత్యధికంగా ఉన్నా వాల్మీకి, మైనార్టీలు కలిస్తే విజయం తమదే అన్నారు. అందరం కలిసి విజయం దిశగా పార్టీని తీసుకెళ్దామన్నారు. అనంతరం నరేష్ మాట్లాడుతు హిందూపురం నియోజక వర్గం నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పోటీ చేయాలని పెద్ద ఎత్తున పోస్టు కార్డు ఉద్యమం చేపట్టామన్నారు. అయితే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి దీపికకు మద్దతు ఇవ్వాలని సూచించారు. ఆయన సూచనల మేరకు తమ మద్దతు దీపికకు ఇస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పని చేసి దీపికను గెలిపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకూ పోరాటం

సంఘం రాష్ట్ర అధ్యక్షులు పన్నీటి కాశయ్య



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని గణేష్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయి ఆరామంలో జిల్లా రజక సంఘం తొలి మహాసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కాశయ్య మాట్లాడుతూ చాలా రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ, ఎస్టీలుగా ఉన్నారన్నారు. ఎపిలో కూడా షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలని చాలా ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. షెడ్యూల్ జాబితాలో చేర్చితే గ్రామాల్లో దాడులు, బహిష్కరణలు ఉండవని, రజకుల పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రజక పేద విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అవుతున్నా రజకులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కొత్త జిల్లాలో తొలి మహాసభ నిర్వహిస్తున్నమన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, రాష్ట్ర కార్యదర్శి తేలిక ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపనపల్లి శివప్ప, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ రజకుల కోసం నిర్మించిన దోభి ఘాట్లు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, ప్రొద్దుటూరు వెంకటేశు, కోగిర సువర్ణ, రామచంద్ర, నారాయణప్ప, కనుముక్కల లక్ష్మన్న, జిల్లా నలుమూలల నుంచి రజకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com



మాజీ ఎంపి శ్రీరామరెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న రఘువీరారెడ్డి

మాజీ ఎంపీ శ్రీరామరెడ్డికి రఘువీరా నివాళి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండల పరిధిలోని నీలకంఠాపురం గ్రామంలో వారి పెదనాన్న శ్రీరామరెడ్డి సమాధి వద్ద ఆదివారం మాజీ మంత్రి రఘువీరారెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బిసి హాస్టల్ విద్యార్థి దేశ దేశభక్తి గీతం పాడగా రఘువీరా అభినందించారు. అనంతరం వారి పెదనాన్న రాసిన ఓ పాట ను తను పాడుతూ అందరితోనూ పాడించారు. ఉన్నత విద్యావంతుడిగా, ఆదర్శ రైతుగా, గొప్ప పార్లమెంటేరియన్‌గా, స్వాతంత్ర్య సమరయోధుడిగా కీర్తి గడించిన మీరు నేటి గ్రామీణ రైతులు, యువకులు, విద్యార్థులకు ఆదర్శప్రాయమని రఘువీరా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

వక్కలిగలను ఒబిసిలో చేర్చేంత వరకూ పోరాటం

ప్రజాశక్తి-మడకశిర

కుంచిటి వక్కలిగలను ఒబిసి జాబితాలో చేర్చేంత వరకూ పోరాటం చేస్తామని ఆ సంఘం నాయకులు స్పష్టం చేశారు. కర్నాటకలోని తుమకూరులో ఆదివారం శిర ఎమ్మెల్యే జయచంద్ర అధ్యక్షతన కుంచిటి వక్కలిగ మహా సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆ సమావేశానికి హాజరైన మడకశిర తాలూకా సంఘం అధ్యక్షుడు అనంతరాజు మాట్లాడుతూ కుంచిటి వక్కలిగలను ఒబిసి జాబితాలో చేర్చేంత వరకూ పోరాటం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే జయచంద్ర మాట్లాడుతూ ఆంధ్ర, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోని కుంచిటి వక్కలిగులను ఒబిసి జాబితాలో చేర్పించడానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు. ఆ సభకు మడకశిర నియోజకవర్గం నుంచి సంఘం నాయకులు భారీగా తరలి వెళ్లారు.

మహాభారత ఇతిహాస పఠనం

ముదిగుబ్బ : వర్షాలు సమృద్ధిగా కురవాలని కాంక్షిస్తూ వరుణ దేవున్ని ప్రార్థిస్తూ ఆదివారం స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ మహాభారత ఇతిహాసంలోని విరాట పర్వం చదివారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని జయప్రదం చేశారు. కార్యక్రమంలో కేతిరెడ్డి మునిరామిరెడ్డి, బండి శివయ్య, ఆంజనేయులు, రాజు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తిరుమల కాలినడక భక్తులకు భద్రత కల్పించాలి

మడకశిర : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమల తిరుపతి దేవాలయానికి కాలినడకన వెళ్లే భక్తులకు పటిష్ట భద్రత కల్పించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఆర్ మురళి కోరారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ టిటిడి భద్రతా సిబ్బంది, అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలినడక మార్గంలో చిన్నారి వన్య మృగానికి బలైందన్నారు. నిజాలు తెలుసుకోకుండా కోవూరు వైసిపీ ఎమ్మెల్యే తల్లిదండ్రులపై అనుమానం ఉందని గట్టిగా యాక్షన్ తీసుకోండని వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా కొనసాగడానికి అనర్హుడన్నారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా తితిదే యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

న్యాయవాదిని పరామర్శించిన 'గుండుమల'

మడకశిర : అమరాపురం మండలంలో ఉన్న న్యాయవాది రవి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న గుండుమల తిప్పేస్వామి న్యాయవాది రవి ఇంటికి వెళ్లి పరామర్శించి, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపిపి కృష్ణమూర్తి, విశ్రాంత ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ మల్లికార్జున, దాదు, తదితరులు ఉన్నారు.

మహమ్మద్ ప్రవక్త దివ్య వస్తువుల ప్రదర్శన

పెనుకొండ : పట్టణంలోని దర్గా పేటలో ఉన్న దివాన్ ఖానా వద్ద 40 రకాల మహమ్మద్ ప్రవక్త, కుటుంబ సభ్యుల పవిత్రమైన దివ్య వస్తువుల ప్రదర్శనను ఆదివారం బాబాయ్య స్వామి దర్గా పీఠాధిపతి తాజ్ బాబా ప్రారంభించారు. దీంతో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వాటిని దర్శించుకున్నారు. సోమవారం కూడా దివ్య వస్తువుల ప్రదర్శన ఉంటుందని తాజ్‌బాబా తెలిపారు.

మైనర్లు బైక్ నడిపితే చర్యలు

రొద్దం : మైనర్ బాలురు, బాలికలు ద్విచక్ర వాహనం నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ నాగస్వామి హెచ్చరించారు. ఇందులో భాగంగా పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో తురకలాపట్నం జడ్పీహైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి(13) బైక్ నడుపుతుండగా మందలించి పంపించారు. ఇక నుంచి మండలంలో ఎవరైనా చిన్న వయసు వారు ద్విచక్ర వాహనం, ఆటో నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ

పెనుకొండ : యుటిఎఫ్ పెనుకొండ జోన్ ఆధ్వర్యంలో రామాంజనేయులు జ్ఞాపకార్థం జరుగుతున్న టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం మ్యాచ్‌లను సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు హరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రొద్దం,పెనుకొండ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-సోమందేపల్లి



టిడిపి పథకాలను ప్రజలకు వివరిస్తున్న బికె పార్థసారథి

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని, రాబోవు ఎన్నికల్లో ప్రతిఒక్క టరూ చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ నియోజక వర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొనతట్టుపల్లి, కొలింపల్లి గ్రామాల్లో ఆదివారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు బికె పార్థసారథి భార్య కమలమ్మకు ప్రజలు హారతులు, పూలు, టపాసులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు భవిష్యత్తుకు గ్యారెంటీ, మహాశక్తి పథకాల కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ వివరించారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనలో దౌర్జన్యాలు, దందాలు, దాడులతో అధికారపార్టీ నాయకులు రెచ్చిపోతున్నారన్నారు. చంద్రబాబు సిఎం అయితేనే సువర్ణపాలన వస్తుందని, తద్వారా పేదప్రజల కష్టాలు తీరుతాయన్నారు. సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాలను వివరించారు. పేద ప్రజల కోసం చంద్రబాబు నాయుడు మినీఫెస్టో పథకాలు విడుదల చేశారన్నారు. ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా దసరాకు పూర్తి మేనిఫెస్టో విడుదల చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు సంజీవరెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, మండల కన్వీనర్ సిద్ధలింగప్ప, టౌన్ అధ్యక్షుడు వడ్డీ సురేష్, మహిళా నాయకురాలు పెనుగొండ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి నాగమణి, మండల మహిళా అధ్యక్షులు సుజాత, క్లస్టర్ ఇన్‌ఛార్జి టౌన్ ప్రధాన కార్యదర్శి అశ్వర్థ, ఉప్పర రాష్ట్ర సాధికార కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పర గోపాల్, రామాంజ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, వెంకటేష్, ఆంజనేయ, నరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంఆర్ హనుమంతును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధాకర్, తదితరులు

ఉద్యమకారుడు గద్దర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని ఆదిరెడ్డి పాలెం అక్షర జూనియర్ కళాశాలలో ఆదివారం జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారుడు గద్దర్‌కు అక్షర నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ గద్దర్ ప్రజల సమస్యలను ఎలుగెత్తి చాటారని, తన పాటల ద్వారా ప్రజలను చైతన్య పరిచారని కొనియాడారు. గద్దర్ ఏ ఒక్క వర్గం, భావజాలానికి పరిమితం కాలేదని, ఆయన పాట, మాట, ఆటతో జన హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచి ఉంటారన్నారు. విశిష్ట అతిథి, స్వాతంత్ర్య సమరయోధులు మెళవాయి గోవిందరెడ్డి మాట్లాడుతూ జీవితమంతా ప్రజలు, జానపద పాటల కోసం అంకితం చేసిన గద్దర్ లాంటి వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తారని కొనియాడారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే డా. ఎం.తిప్పేస్వామి మాట్లాడుతూ దిగ్గజ కవి, విప్లవ వీరు డు, ఉద్యమకారుడు గద్దర్‌కు అనంతపురానికి విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన వారసత్వం మనందరికీ స్ఫూర్తిదాయకం కావాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్, జాబిలి చాంద్‌బాషా, టిప్పుసుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు కెఎం ఉమర్‌పారుఖ్‌ఖాన్, రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివన్న ఆధ్వర్యంలో ఎంఆర్ హనుమంతుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, ప్రముఖ కవులు దోరణాల విధురరెడ్డి, డా. శివలింగప్ప, లీలా మనోహర్, మధురశ్రీ, కరియన్న, డి.గంగులప్ప సత్యనిర్ధారణ్, మాణిక్యం ఇసాక్, అశ్వర్థనారాయణ, ఈడిగ ముద్ద రంగప్ప, ఎ.సుబ్రహ్మణ్యగుప్తా, కె.ఈశ్వర్, నాగభూషణ, ఆర్‌కె గుప్తా, ఇ.బాలకృష్ణ, శ్రీతేజ, కె.గోపాలకష్ణ, కళ్యాణదుర్గం బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన మొహరం వేడుకలు

ప్రజాశక్తి-బత్తలపల్లి



బుక్కపట్నంలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహరం వేడుకలను మండల పరిధిలోని తంబాపురం, నల్లబోయనపల్లి, నెత్తివారంపల్లి, జ్వాలాపురం గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం ముజావర్లు, మత పెద్దలు పీర్లతో అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించగా భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించారు. అనంతరం గుండం వద్దకు చేరుకుని జంతుబలి నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని ప్రజలందరూ చావిడి వద్దకు చేరుకుని అగ్నిగుండాన్ని పూడ్చారు. తర్వాత పీర్లను ఊరేగింపుగా గ్రామం వెలుపలకు తీసుకెళ్లి జలధి కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అనంతరం విషాద గీతాలాపనతో తిరిగి పీర్లను ఒక మూటగా కట్టుకొని వచ్చి చావిడికి చేర్చారు. దీంతో ఉత్సవాలు ముగిసాయి. వేడుకల్లో ఎస్ఐ టీవీ శ్రీహర్ష సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

బుక్కపట్నం : మొహరం పర్వదినం పురస్కరించుకొని బుక్కపట్నంలో ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా స్థానిక కోటవీధి, పేట వీధిలో పూజలు అందుకున్న పీర్లను సాయంత్రం ఆనందోత్సాహాలు, డప్పు వాయిద్యాల మధ్య జలధి కార్యక్రమానికి తరలించారు. జలధి ఊరేగింపులో భాగంగా స్థానిక తేరు కూడలిలో రెండు వీధుల్లోని పీర్లు కలిశాయి. ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని కత్తివారిపల్లి, తాళ్లకాల్వ గ్రామాల్లో ఆదివారం చిన్న పీర్ల ఉరుసును భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామాల్లో ఐదు రోజులుగా పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు.

అవయవ దానంపై అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



విలేకరులతో మాట్లాడుతున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

మనిషి అవయవ దానం చేయడం వల్ల మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు రామచంద్రగుప్తా పేర్కొన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా ఆదివారం వారు ప్రజలకు పలు విషయాలను తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మనిషి జీవించాలంటే శరీరంలోని అవయవాలు సక్రమంగా పనిచేయాలని, కొన్ని కారణాల వల్ల దేశీయంగా ఎంతోమంది కీలక అవయవాలు విఫలమై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. అవయవ మార్పిడితో వారి జీవితాల్లో తిరిగి కొత్త వెలుగులు నింపవచ్చునని తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు 220 మంది నేత్రాలు స్వీకరించి, వాటిని ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ కూడా పంపామన్నారు. ప్రతి మనిషి మృతి చెందిన తర్వాత తన అవయవాలను దానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోలా ప్రభాకర్, డాక్టర్ సుబ్బారావు, బండ్లపల్లి రంగనాథ్, పిఆర్‌ఒ జయరాం, పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కంటి వెలుగును ప్రసాదించడమే రోటరీ క్లబ్ లక్ష్యమని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహా, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా, క్యాంపు ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్, బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఈ శిబిరానికి దాతలుగా పట్టణంలోని సుకన్య సిల్క్స్ ధర్మవరం యాజమానులు కలవల సుకన్య జ్ఞాపకార్థం భర్త కలవల మురళీధర్, కుమారుడు నాగతేజ, కోడలు శర్వాణి, మనవడు నిహాన్ వ్యవహరించారని తెలిపారు. ప్రతి నెలా రెండవ ఆదివారం ఈ శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. శిబిరంలో 160 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా 102 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వీరందరికీ ఉచిత ఆపరేషన్‌తో పాటు అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం బెంగళూరు డాక్టర్ అతిర, పిఆర్‌ఒ శివప్రకాష్, దాత కలవల మురళీధర్‌లను యువర్స్ ఫౌండేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్రశాల ప్రసన్నకుమార్, రమేష్ బాబు, శివయ్య, రత్నశేఖర్ రెడ్డి, కష్ణమూర్తి, జయచంద్ర, కొండయ్య, మనోహర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

చిరిగిన, దుమ్ముపట్టిన

జాతీయ జెండాల అవనతం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

పట్టణంలో వివిధ భవనాలపై చిరిగిన, దుమ్ముపట్టిన జాతీయ జెండాలను ఆదివారం స్థానిక పాత్రికేయులు అవనతం చేసి తొలగించారు. ఇందులో భాగంగా మెయిన్ రోడ్డులోని శేషు ఫ్యాషన్స్ బిల్డింగ్‌పైన, మూడు వ్యాపార సముదాయాలపైన, వాసవీ టెంపుల్ వెనుక భాగంలో ఇంటిపైన, పట్టణ నడిబొడ్డున గాంధీ విగ్రహం వద్ద, మాధవరాయ ఆలయం వద్ద, మసీద్ సర్కిల్‌లో పలు గహాలపైన, తదితర ప్రాంతాల్లో సుమారు 20 వరకూ చిరిగిన, దుమ్ముపట్టిన జాతీయ జెండాలను అవనతం చేసి తొలగించారు. అలాగే జాతీయ జెండాను నిర్లక్ష్యంగా వదిలేసిన వారికి త్రివర్ణ పతాకం ఔన్నత్యం, దేశభక్తి, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత గురించి అవగాహన కల్పించారు. రాబోయే ఆగస్టు 15న జెండా ఆవిష్కరణ అనంతరం అలాగే వదలివేయకుండా జాగ్రత్తగా తీసి దాచాలని, ఎక్కడపడితే అక్కడ పడవేయవద్దని కోరారు. కార్యక్రమంలో పాత్రికేయులు నరసారెడ్డి, క్రిష్టప్ప, మోహన్, అంబే వెంకటేష్, మస్తాన్, ఫకృద్దీన్, శివ, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం, పునరావాసం కల్పించాలి : చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



చిలకం మధుసూదన్ రెడ్డికి నోటీసు అందజేస్తున్న ఎస్ఐ రఫీ

తాడిమర్రిలో రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లను నేలమట్టం చేయడం దుర్మార్గమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించడానికి ఆదివారం ఆయన తాడిమర్రికి బయల్దేరారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ మహమ్మద్ రఫీ సిబ్బందితో పట్టణంలోని చిలకం ఇంటి వద్దకు చేరుకుని నోటీసులు అందజేసి గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా చిలకం విలేకరులతో మాట్లాడుతూ తాడిమర్రిలో ఎన్నో ఏళ్ల నుంచి పేద ఆర్యవైశ్యులు, మైనార్టీలు, తదితరులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రోడ్డు విస్తరణ చేసేటప్పుడు బాధితులకు పరిహారం ఇవ్వడంతో పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియాతో ఎమ్మెల్యే కేతిరెడ్డి కుమ్మక్కై టిప్పర్లను తరలించడానికి రోడ్డు విస్తరణకు పూనుకున్నారని ఆరోపించారు. పులివెందుల నియోజకవర్గానికి పక్కనే ఉన్న తాడిమర్రిలో ఇంత అరాచకం చేస్తుంటే సిఎం జగన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జనసేన నాయకులను అడ్డుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదని, బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాడిమర్రి మండల ప్రజలు ఎమ్మెల్యేపై తగిన గుణపాఠం చెబుతారన్నారను.



టిడిపి రాయలసీమ డిక్లరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

టిడిపి రాయలసీమ డిక్లరేషన్‌పై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో ఆదివారం తెలుగు యువత ఆధ్వర్యంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించిన మిషన్ రాయలసీమ డిక్లరేషన్‌పై కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి రాష్ట్ర యువ నేత చిన్నపొల్ల సంతోష్ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ వల్ల రాష్ట్రం అభివృద్ధిలో 20ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధిలో దూసుకెళ్లాలంటే వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు సిఎం కావాలని తెలిపారు. టిడిపి హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను, 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్, పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మనోహర్, ఉపాధ్యక్షులు వైవి మురళీచౌదరి, పార్లమెంటు కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, బళ్లారి సుధాకర్, పుట్టపర్తి మండల అధ్యక్షుడు గెనకాని చిన్నప్ప, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు మీసేవా సుధాకర్, బడా మధుసూదన్‌రెడ్డి, బడా మహేష్‌రెడ్డి, ఐటిడిపి మల్లికార్జున, పెడపల్లి సతీష్‌కుమార్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

దొంగఓట్లపై దృష్టి సారించాలి : కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

అధికారం కోల్పోతామని వైసిపి దొంగ ఓట్లు చేర్చే ప్రయత్నం చేస్తుందని టిడిపి శ్రేణులు అప్రమత్తంగా ఉండి వారి చర్యలను అడ్డుకోవాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, పరిశీలకులు హరిప్రసాద్ బూత్ స్థాయి ఇన్‌ఛార్జులకు సూచించారు. పట్టణంలోని కందికుంట నివాసంలో ఆదివారం కందికుంట అధ్యక్షతన పరిశీలకులు బి.హరి ప్రసాద్ 6 మండలాల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులకు ఓటు వెరిఫికేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు వెరిఫికేషన్ కీలకమని, పట్టణాలు, స్లమ్ ఏరియాల్లో దొంగ ఓట్లకు అవకాశం ఉంటుందన్నారు. కావున ప్రతి ఓటరునూ కలవాలని సూచించారు. టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మండల కన్వీనర్లు బాషా, హరిక్రిష్ణ, ముబారక్, కొండయ్య, రాజశేఖర్, రెడ్డి శేఖర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జులు గుత్తా ప్రసాద్, పవన్ కుమార్, రమేష్ బాబు, గంగరాజు, హరి, రమణ పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి మున్సిపల్ పరిధిలోని హిందూపురం రోడ్డు, బైపాస్ రోడ్డుకు సమీపంలోని సర్వే నెంబర్-83లో గుట్టలో ప్రభుత్వ స్థలంలో అక్రమ పట్టాలు సృష్టించి పంపిణీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సిపి) డివిజన్ కార్యదర్శి ఇలియాజ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలంలో జెసిబిలతో భూమి చదును చేసి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్న ప్రదేశాన్ని ఆదివారం ఆర్‌సిపి కదిరి డివిజన్ కార్యదర్శి టిఎండి ఇలియాజ్ ఆధ్వర్యంలో రాయలసీమ మహిళా సంఘం సత్యసాయి జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్, నాయకులు రాజేష్, మణినాయక్, తదితరుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొందరు కబ్జాదారులు రెవెన్యూ అధికారులతో కలిసి దొంగ పట్టాలు సృష్టించి ఒకొక్కరి నుంచి రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకూ దండుకుని ప్లాట్లు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, లేనిచో పోరాటాలు చేసేందుకు సిద్ధమని హెచ్చరించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-లేపాక్షి

నాదేశం-నాభూమి కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యాలయకు చెందిన ప్రతి ఎన్‌సిసి క్యాడెట్ మట్టి మీద తమ ప్రేమను తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటుదాం-ఆరోగ్యంగా ఉందాం అంటూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అలాగే విద్యాలయ మైదానంలో జాతీయ పతాకాన్ని పట్టుకొని ఫ్రీడమ్ రన్ నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ అసఫ్ అలీ, ఆర్.అంబురాజన్, నాగరాజన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మూర్ఛ(ఫిట్స్)తో బాధపడుతున్న వ్యక్తి ఆరుబయట బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని సంగాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరా లు.. సంగాల గ్రామానికి చెందిన సత్యనారాయణ(34) మూర్ఛతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులందరూ బంధువుల ఇంట్లో శుభకార్యానికి అప్పరాచెరువుకు వెళ్లారు. అతడు బహిర్భూమికి చిత్రావతి నదిలోకి వెళ్లి నీటి గుంతలో మృతి చెందాడు. అటుగా వెళ్తున్న సర్పంచి కంచనగారి రాజశేఖర్‌రెడ్డి గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య సరోజమ్మ, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. నీటి గుంత ఎక్కువ లోతు లేదని ఫిట్స్ వచ్చి అందులో పడి మృతి చెంది ఉంటాడని బంధువులు తెలిపారు.

బేల్దారి ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని లోనికోటకు చెందిన చాంద్‌బాషా(40) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. లోనికోటకు చెందిన చాంద్‌బాషా బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే మద్యం, తిరుగుళ్లకి అలవాటుపడిన అతడు ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అతడికి భార్య షకీల, ఇద్దరు కుమారులున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి....



వెంకటేష్

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు గ్రామపంచాయతీ చిన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డిమేకలప్ప గారి వెంకటేష్(38) కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకి సమాచారం ఇచ్చారు. వెంకటేష్ కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడు తూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాడని, కడుపు నొప్పి తాళ లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామానికి చెందిన మానసిక వికలాంగుడు దిలీప్‌కుమార్‌నాయక్(23) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాల మేరకు.. దిలీప్ కుమార్ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడం, దీనికి తోడు తల్లిదండ్రులు ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కుదరలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దిలీప్ ఈ నెల 5వ తేదీ తన పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే కదిరి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవల కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అయితు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తండ్రి రామస్వామి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రజలకు టిడిపి మేనిఫెస్టోను వివరిస్తున్న నాయకులు

మహిళా సాధికారతే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి-మడకశిర

మహిళా సాధికారతే టిడిపి ధ్యేయమని ఐటిడిపి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు తెలిపారు. అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయతీలో ఆదివారం మండల నాయకులు, తెలుగు మహిళ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి టిడిపి హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలతో రూపొందించిన మినీ మేనిఫెస్టో, మహాశక్తి గురించి ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ టిడిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ గణేష్, మాజీ ఎంపిపిలు మీనాక్షి రామిరెడ్డి, కృష్ణమూర్తి, మాజీ జడ్పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు జయకుమార్, మంజునాథ్, కృష్ణమూర్తి, ఓంకార్‌స్వామి, రామచంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా హైదరవలి

ముదిగుబ్బ : ముదిగుబ్బలో నివాసం ఉంటున్న కొడైకంటి హైదరవలిని ఎపి నూర్‌బాషా(దూదేకుల) సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాష్ట్ర కమిటీ నియమించింది. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కె.పీర్ మహమ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాష్ట్ర ముఖ్య సలహాదారు కాశీం సాబ్, గఫూర్‌సాబ్ తదితరులకు ఆదివారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఓ ప్రకటనలో తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

ప్రజాశక్తి-సోమందేపల్లి

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల పరిధిలోని రజకులు సోమందేపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా వారు చౌడేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పుట్టపర్తిలో జరిగే మహాసభకు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లోని రజకులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రజక కమిటీ హాల్ నిర్మించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మూడెకరాల భూమి కేటాయించాలని, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ఉచిత కరెంటు ఇవ్వాలని నినాదాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో సంజీవరాయుడు, నారాయణప్ప, శ్రీనివాసులు, రామాంజనేయులు, నారాయణస్వామి, గోవిందప్ప, నరసింహప్ప, తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

ధర్మవరం టౌన్ : చేనేతలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని నియోజకవర్గ కో ఆర్డినేట్ కమిటీ కన్వీనర్ షేక్ షాన్వాజ్ పేర్కొన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం షేక్ షాన్వాజ్ సమక్షంలో నియోజకవర్గ సమన్వయ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇందులో రంగన అశ్వర్థనారాయణ, ప్రసాద్, మంజుల, నరేంద్ర, చింతయ్య, నజీర్ అహమ్మద్, ప్రభాకర్, కాటమయ్య గిరి, గణేష్‌లను నియమించారు. ఈ సందర్భంగా షాన్వాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల అభివృద్ధి కోసం కృషి చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని కోరారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరలు నిలకడగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగన అశ్వర్థనారాయణ, నిషార్ అహమ్మద్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

ధర్మవరం టౌన్ : కరాటేతో ఆత్మవిశ్వాసం కల్గుతుందని ఎపి పోలీస్ అకాడమీ కోచ్ మురళీకృష్ణ, మల్టీ స్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కోచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు కరాటే దోహదం చేస్తుందన్నారు. సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కోవాలంటే కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్టులు అందజేశారు.